
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
జనగామ
ఆదివారం 7 జనవరి 2024



అమ్మితేనే... ఆకలి తీరేది

తేనె మాటున 'చేదు' బతుకులు..!

- ఏళ్లుగా ఎదుగూ బొదుగూ లేని జీవితాలు
- సంచార బతుకులే వాళ్ల జీవన గమనం
- చెట్లు, పుట్టలే ఆవాసాలు



జనగామ-సూర్యాపేట జాతీయరహదారిపై తేనె అమ్ముతున్న కార్మికులు



లింగాలఘణపురం, జనవరి 6: తేనెటీగల గుంపు లేచిందంటే చాలు అక్కడున్న వాళ్లంతా పరుగులు పెట్టాల్సిందే.. పొరపాటున ఒక్కటి చిటుక్కున కుట్టిందంటే చాలు.. గుంపంతా చుట్టుముట్టి.. వెంటాడి వేటాడటం వాటి సహజ లక్షణం.. అందుకే తేనెటీగల జోలికి వెళ్లాలంటే చాలా మంది వెనకడుగు వేస్తుంటారు.. కానీ కొద్ది మంది మాత్రం తేనెటీగలతో సహవాసం చేస్తున్నట్లుగానే.. ఓ వైపు అవి కుడుతున్నా నొప్పిని భరిస్తూ తేనె తుట్టెను చేతుల్లోకి తీసుకుంటారు.. తుట్టె నుంచి తియ్యటి తేనెను తీసి అందరి నోళ్లను తీపి చేస్తుంటారు. ఒక్కోసారి తేనెటీగల దాడికి గురై ఒళ్లంతా తీవ్ర గాయాల పాలవుతారు. కష్టాలను ఎదుర్కొంటూ తీసిన తేనె అమ్ముడుపోతేనే వాళ్లకు ఆరోజు కడుపులు నిండేది. ఒకవేళ తుట్టె నుంచి తీసిన తేనెను కొనే దిక్కులేకపోయినా.. పట్టేందుకు తేనె తుట్టెలు దొరకకపోయినా వాళ్ల కుటుంబమంతా ఆ రోజున పస్తులతో గడపాల్సిందే. సంచార జీవులుగా ఊళ్లను చుట్టేస్తూ.. చెట్లనే ఆవాసాలుగా మలుచుకుని జీవిస్తున్న ఈ బడుగుల బతుకులు తేనెమాటున చేదు జీవితాలను వెళ్లదీస్తున్నాయి. పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్.. ఎడారి ప్రాంతమైన రాజస్థాన్.. దుర్భర పరిస్థితులకు ఆలవాలమైన బిహార్.. ప్రాంతమేదైనా అనేక కుటుంబాలు తేనెను జీవనాధారంగా చేసుకుని బతుకులను వెళ్లదీస్తున్నాయి. ఒక్కో సీజన్‌లో ఒక్కో ప్రాంతానికి తరలివెళ్తూ సంచార జీవితాన్ని గడుపుతున్న తేనెపట్టు కార్మికులపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

చెట్ల కిందనే సేదదీరుతున్న తేనె కార్మికులు (ఫైల్)

అమ్మి'తేనే' అన్నం..

ఆంధ్రప్రదేశ్, బిహార్, రాజస్థాన్ ప్రాంతాలకు చెందిన అనేక కుటుంబాలు తేనెతుట్టెలను జోషుకుంటూ వచ్చిన ఆదాయంతో కడుపులు నింపుకుంటున్నాయి. అక్కడి ప్రాంతాల్లో వాళ్లకు సరైన జీవనాధారం లేకపోవడంతో పాటుగా ఎలాంటి స్థిర, చర ఆస్తులు లేకపోగా జనగామ, యాదాద్రిభువనగిరి, వరంగల్, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్‌లాంటి ప్రాంతాల్లో సంచరిస్తున్న తేనెబతుకులు ఆకలి కడుపుకు అన్నం మెతుకులను వెతుక్కుంటున్నారు. వీళ్లకు అడవులే ఆధారంగా.. చెట్లు చేమలే ఉపాధిగా ముందుకు సాగుతున్నారు. జనగామ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ నగర్, పాలకేంద్రం ఏరియాల్లో నివాసము ఒంటున్న తేనె పట్టేవాళ్లు నిత్యం అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారు. పొద్దంతా చెట్లు, చేమల వెంట తిరిగితే దొరికిన తుట్టెలను చాకచక్యంతో చేతికి అందుకుని తేనె పడుతూ జిల్లా వాసుల నోళ్లను తీపి చేస్తున్నారు. ఎక్కువ శాతం జనగామ రూరల్, లింగాలఘణపురం, దేవరుప్పుల, పాలకుర్తి, స్టేషన్‌ఘన్‌పూర్, నర్మెట ప్రాంతాల్లో తేనెను సేకరించి హైద్రాబాద్-హన్మకొండ, జనగామ -సూర్యాపేట, సిద్దిపేట-జనగామలాంటి ప్రధాన రహదారుల వెంబడి వాహనదారులకు విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో పొట్టగడుపుకుంటున్నారు.

ప్రమాదపుటంచుల్లోనూ సాహసం

ప్రధానంగా తేనెటీగలు తమ ఆవాసాలను సురక్షిత ప్రాంతాలైన ఎత్తైన సెల్‌టవర్లు, అపార్ట్‌మెంట్లు, భవనాలు, భారీ వృక్షాలను అడ్డాగా మార్చుకుని తేనెతుట్టెను ఏర్పాటు చేసుకుంటాయి. అయితే వాటిని తొలగించడం సామాన్యులు అంతగా సాహసం చేసేందుకు ముందుకు రాకపోగా ఇలాంటి వృత్తినైపుణ్యతను పెంపొందించుకున్న వాళ్లతో తేనెతుట్టెలను డబ్బులు చెల్లించి తొలగిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో తేనెతుట్టెను ఎత్తైన ప్రదేశాలకు వెళ్లి ప్రమాద పుటంచుల్లో నుంచి తొలగించడమంటే సాహసాన్ని కూడగట్టుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం సంబంధిత వ్యక్తులతో ముందే బేరం కుదుర్చుకుని చెట్లు, అపార్ట్‌మెంట్లు, సెల్‌టవర్లను ఎక్కి తేనెతుట్టెను తొలగిస్తారు. ఇలాంటి సందర్భాల్లో పలుమార్లు ప్రమాదాలకు గురై కాళ్లు చేతులు విరిగిపోయినవాళ్లు కూడా ఉన్నారని పేర్కొంటున్నారు.

పది రోజులకో పట్టణం..

తేనె సేకరించే కార్మికులు ఏడాది మొత్తం స్థిరంగా ఒకే చోట ఉండటం వాళ్ల బతుకుదెవరుకు కష్టసాధ్యంగా ఉంటుంది. అందుకోసమే తెలంగాణ వ్యాప్తంగా సంచరిస్తూ పదిరోజులకు ఒక పట్టణం, గరిష్ఠంగా 20 రోజులకు ఒకప్రాంతాన్ని

మిగతా 8వ పేజీలో...

అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు

రాబోయే పెండింగ్ పనులన్నీ పూర్తి చేస్తాం..

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



సింగరాజుపల్లిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల, జనవరి 6: ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకున్న అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందుతాయని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. మండలంలోని సింగరాజుపల్లిలో శనివారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో దేవరుప్పుల ఎంపీపీ బస్వ సావిత్రి, వైస్ ఎంపీపీ కత్తుల విజయ్ కుమార్, సర్పంచ్ గోపాల్‌దాస్ మల్లేష్, స్పెషల్ ఆఫీసర్ హుస్సేన్, ఎంపీడీఓ ఉమామహేశ్వర్, ఏపీఓ శ్రీనివాస్, ఏఈవో సాగర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

పాలకుర్తి : క్రీడలతోనూ ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. పాలకుర్తి మండలంలోని నారబోయినగూడెం శివారులో నల్లిగాని కుంట తండాలో సేవాలాల్ మండల కమిటీఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కబడ్డీ క్రీడలను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, భాస్కర్, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్, భార్గవ్ తదితరులు ఉన్నారు.

జిల్లాలో లక్షా 78 వేల దరఖాస్తులు

ముగిసిన ప్రజా పాలన కార్యక్రమం

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోనే అధిక శాతం దాఖలు

వేగంగా సాగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియ

జనగామ టౌన్, జనవరి 6: ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేయడంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పరిపాలన కార్యక్రమం శనివారం ముగిసింది. ఎనిమిది రోజుల పాటు జిల్లావ్యాప్తంగా దరఖాస్తుల స్వీకరణ నిర్వహించగా మొత్తంగా 1,78,843 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో 76,883 దరఖాస్తులు రాగా.. జనగామ నియోజకవర్గంలో 59,243, పాలకుర్తి నియోజకవర్గంలో 42,717 అప్లికేషన్లు వచ్చాయి. 30 ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి 1300లకు పైగా కౌంటర్లు ఏర్పాటు చేసి గ్రామ, వార్డు సభల ద్వారా జిల్లా యంత్రాంగం దరఖాస్తుల స్వీకరణ తంతును పూర్తి చేసింది. మండలాల వారీగా చూస్తే.. బచ్చన్నపేటలో 14,308, జనగామ రూరల్‌లో 13,084, నర్మెటలో 7,684, తరిగొప్పులలో 5,962, జనగామ అర్బన్‌లో 18,205, చిల్పూరులో 13,796, స్టేషన్‌ఘన్‌పూర్‌లో 17,726, లింగాలఘణపురంలో 13,452, రఘునాథపల్లిలో 17,808, జఫర్‌గఢ్‌లో 14101, దేవరుప్పులలో 13,018, కొడకండ్లలో 10,076, పాలకుర్తిలో 19,623 దరఖాస్తులు వచ్చాయి.

17వ తేదీ లోపు ఆన్‌లైన్ పూర్తి

ప్రజా పరిపాలన కార్యక్రమంలో స్వీకరించిన దరఖాస్తులను అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నెల 5న జనగామ మండలం యశ్వంతపూర్ పరిధిలోని సీజేఐటీలో ఆన్‌లైన్ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే అప్లికేషన్లను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ నెల 17 వరకు జిల్లాలో వచ్చిన లక్షా 78 వేల 843 దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు టార్గెట్‌గా పెట్టుకున్నారు. ఆ దిశగా ఇప్పటికే పనులు జరుగుతున్నాయి.

నేడు 'ఆంధ్రజ్యోతి' ముత్యాల ముగ్గుల పోటీలు

జనగామలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో ఏర్పాట్లు

జనగామ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ప్రతీ ఏటా ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఆదివారం (నేడు) జరిగే "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్ణసీమ సుకేతన" పోటీలకు జిల్లాకేంద్రంలోని నెహ్రూపార్కు వద్ద ఉన్న సెయింట్‌పాల్స్ హైస్కూల్‌లో ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. తెలుగు సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలనే సంకల్పంతో 'ఆంధ్రజ్యోతి' ప్రతి ఏటా ముగ్గుల పోటీని నిర్వహిస్తోంది. ఆదివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పోటీలు జరుగుతాయి. ఆసక్తి గల వారు సెయింట్ పాల్స్ హైస్కూల్‌కు గంట ముందుగా చేరుకొని తమ పేర్లను నమోదు చేసుకోవాలి. పోటీల్లో పాల్గొనే మహిళలు సుద్ద, రంగులు వారే వెంట తెచ్చుకోవాలి.

న్యాయనిర్ణేతల నిర్ణయం మేరకు పోటీల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు ప్రథమ (రూ. 6 వేలు), ద్వితీయ (రూ.4 వేలు), తృతీయ (రూ.3 వేలు) బహుమతులు అందజేయడం జరుగుతుంది. అలాగే పోటీల్లో పాల్గొన్న వారికి ప్రోత్సాహక బహుమతులు ఉంటాయి. మరిన్ని వివరాలకు 9247209344 నంబరులో సంప్రదించవచ్చు.

జనగామ జడ్పీ చైర్‌పర్సన్‌గా భాగ్యలక్ష్మీ



భాగ్యలక్ష్మీకి అభినందనలు తెలుపుతున్న జడ్పీ సభ్యులు, ఉద్యోగులు

జనగామ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా జడ్పీ వైస్‌చైర్మన్ గిరబోయిన భాగ్యలక్ష్మీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. జనగామ జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి ఇటీవల గుండెపోటుతో మరణించడంతో జడ్పీ చైర్మన్ పదవి ఖాళీ ఏర్పడింది. దీంతో ఆయన స్థానంలో ప్రస్తుతం జడ్పీ వైస్ చైర్మన్‌గా ఉన్న భాగలక్ష్మీ చైర్‌పర్సన్‌గా శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా పరిషత్ ఉద్యోగులు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో జడ్పీ సీఈవో అనిల్‌కుమార్, జనగామ, నర్మెట్ట జడ్పీటీసీలు నిమ్మతి దీపికమహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, జనగామ ఎంపీపీ మేకల కళింగరాజు, కోఆప్షన్ మెంబర్ గౌస్, జడ్పీ ఉద్యోగులు ఉన్నారు.

రఘునాథపల్లి సర్పంచ్ సస్పెన్షన్

రఘునాథపల్లి, జనవరి 6: రఘునాథపల్లి సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు పోకల శివకుమార్‌ను సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ సి.హెచ్.శివలింగయ్య ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ (పంచాయతీ విభాగం) కార్యాలయం అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు రఘునాథపల్లి సర్పంచ్ పోకల శివకుమార్‌ను సస్పెన్షన్ చేయడంతో పాటు ఉప సర్పంచ్ యాదరాములుకు తాత్కాలికంగా సర్పంచ్ బాధ్యతలు అప్పగించేట్లు కలెక్టర్ పంచాయతీ విభాగం అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రఘునాథపల్లి సర్పంచ్ పోకల శివకుమార్‌ను 18 డిసెంబరు 2023న అట్రాసిటీ కేసులో పోలీసులు అరెస్టు చేయగా, జనగామ జిల్లా కోర్టు మొదటి శ్రేణి జడ్జి 12 రోజుల పాటు రిమాండ్ విధించగా అతడు జనగామ సబ్ జైలులో ఉన్న విషయం విదితమే. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సెక్షన్ 277 ప్రకారం పబ్లిక్ సర్వెంట్ ఎవరైనా 48 గంటలు అంటే రెండు రోజుల కంటే ఎక్కువ కాలం జైలు శిక్ష అనుభవిస్తే వారిని విధుల నుంచి తప్పించాల్సిందేనని చట్టం స్పష్టం చేస్తుంది. దీంతో పోకల శివకుమార్ 12 రోజుల పాటు జనగామ సబ్ జైలులో ఉన్నందున కలెక్టర్ కార్యాలయం పంచాయతీ విభాగం అధికారులు కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించేలా కృషి చేయాలి

- జడ్పీ సీఈవో అనిల్‌కుమార్



టీపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జడ్పీ సీఈవో అనిల్‌కుమార్

బచ్చన్నపేట, జనవరి 6 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించే దిశగా ఉపాధ్యాయులు తమవంతు పాత్ర పోషించాలని జడ్పీ సీఈవో అనిల్‌కుమార్ అన్నారు. టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నబోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు అందించటం జరుగుతుందన్నారు. విలువలతో కూడిన విద్యాబోధన అందించి, ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలన్నారు. విద్యా ప్రమాణాల పెంపులో కీలకపాత్ర ఉపాధ్యాయులదన్నారు. తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీవో రఘురామకృష్ణ, నోడల్ ఆఫీసర్ మూర్తి, టీపీటీఎఫ్ మండల అధ్యక్షులు అంకుశావలి, గుంటిపల్లి శ్రీనివాస్, నర్సింహ్మారెడ్డి, యాదగిరి, ఖలీల్, నరేందర్, మహేందర్‌రెడ్డి, అంబదాసు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరుకు జాతర ఏర్పాట్లు పూర్తిచేయాలి

- నాణ్యత లోపిస్తే బాధ్యులు ఇంటికే..
- మేడారానికి అదనపు నిధులిస్తాం..
- కేంద్రం జాతీయ పండగ హోదా కల్పించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- క్షేత్ర స్థాయిలో పనుల పరిశీలన

మేడారం, జనవరి 6 : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టిన పనులు, ఏర్పాట్లను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. నాణ్యత లోపించినా, సకాలంలో పనులు పూర్తికాకున్నా సంబంధిత అధికారులు ఇంటికేనని హెచ్చరించారు. శనివారం తాడ్వాయి మండలంలోని మేడారంలో పర్యటించిన సీతక్క జాతర ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్‌లు శ్రీజ, వేణుగోపాల్, ఇతర శాఖల అధికారులతో కలిసి పనులను పరిశీలించిన సీతక్క పలు సూచనలు చేశారు. వనదేవతల గద్దెలను దర్శించుకొని మెక్కులు సమర్పించారు. అనంతరం ఐటీడీఏ అతిథి గృహంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా.. తెలంగాణ కుంభమేళాగా అభివర్ణించే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో భక్తులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుతం విడుదల చేసిన రూ.75 కోట్లకు అదనంగా మరిన్ని నిధులిస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా జాతర నిర్వహిస్తున్న నేపథ్యంలో అత్యంత అంగరంగ వైభవంగా జరిపిస్తామని తెలిపారు. వనదేవతల విశిష్ఠతను ప్రపంచం నలుమూలల తెలియజేస్తామన్నారు. జాతీయ హోదా కోసం రాష్ట్రపతిని కోరడం జరిగిందన్నారు. అధికారులతో కలిసి మేడారం పరిసరాల్లో మంత్రి సీతక్క కలియదిరిగారు. ఆదివాసీ మ్యూజియాన్ని సుందరీకరించాలని అధికారులను ఆదేశించారు. హరిత హోటల్ మరమ్మతు పనులను త్వరగా చేపట్టాలని సూచించారు. ఇందుకు ప్రభుత్వం రూ.85 లక్షలను మంజూరు చేసిందన్నారు. వీఐపీలు, వీవీఐపీలు వచ్చే రహదారుల పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. ఆర్టీసీ బస్టాండ్, టికెట్ కౌంటర్లు, విశ్రాంతి షెడ్‌లు, తాగునీటి వసతులు, మరుగుదొడ్లు, క్యూలైన్లను పరిశీలించారు. మేడారం వనదేవతలకు భక్తులు బంగారం(బెల్లం) సమర్పించుకొనేందుకు అధికారులు ఆధునిక పద్ధతిలో కన్వేయర్ బెల్ట్‌ను ప్రయోగాత్మకంగా ఈ జాతరలో ఉపయోగించనున్నారు. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేశారు. మంత్రి సీతక్క మేడారం పర్యటన లో భాగం గా సమ్మక్క సారలమ్మలను దర్శించుకొని గద్దెల ప్రాంగణం, క్యూలైన్లు పరిశీలించారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ శబరీశ్‌లకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంతరావు, ఈవో రాజేంద్రం, టెక్నికల్ ఇంజనీరింగ్ అధికారులు ఈ ప్రణాళికను వివరించారు. ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏఎస్పీ శిరిశెట్టి సంకీర్త్ పాల్గొన్నారు.



మేడారంలో రోడ్డు పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న పిడమర్తి రవి

రాష్ట్రంలో రెండు ఎంపీ సీట్లు మాదిగలకు కేటాయించాలి

మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి

హనుమకొండ రూరల్, జనవరి 6: రాష్ట్రంలో ఎక్కువ జనాభా ఉన్న మాదిగలకు అన్ని రాజకీయ పార్టీలు పార్లమెంట్ ఎన్నికల్లో రెండు స్థానాలు కేటాయించాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి డిమాండ్ చేశారు. శనివారం అలంకార్ జంక్షన్‌లోని టీఎన్‌జీవోస్ భవన్‌లో మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైన ఉపేందర్ మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పిడమర్తి రవి మాట్లాడుతూ.. మాదిగలను మోసం చేసిన బీజేపీ తరుఫున మంద కృష్ణ వరంగల్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేస్తే.. తాను కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తానని అన్నారు. మాదిగ ఉద్యమాన్ని పట్టించుకోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాదిగ జేఏసీ కృషి చేస్తుందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగ, మాదిగ ఉపకులాల ఓట్లను దండుకోవడానికే బీజేపీ తెర లేపిందని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదం తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాదిగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ కొడారి ధీరన్, బి.వీరేందర్, వి.శోమచంద్రశేఖర్, ఓ.శంకర్, ఎం.ఆరోగ్యం, సంపత్, ఉపేందర్, మధుకర్, అశోక్, రవి, అనిల్, గోపి, రామ్‌కుమార్, శ్రీనివాస్, కిషన్, మోహన్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

హనుమకొండ రూరల్, జనవరి 6: గ్రూప్ 1, 2, 3, 4 ఫౌండేషన్ కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ ఎంపివి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20వ తేదీలోగా www.tsbcstudycircle.cgg.-gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఇంజనీరింగ్ అధికారుల చేరిక అదనపు బలం

ఉమ్మడి జిల్లా సమన్వయకర్త జగన్మోహన్‌రావు




సభ్యత్వ రశీదును అందచేస్తున్న జగన్మోహన్‌రావు

హనుమకొండ సిటీ, జనవరి 6: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్‌లో జీడబ్ల్యూఎంసీ ఇంజనీరింగ్ అధికారులు మిళితం కావడం తమకు అదనపు బలాన్ని ఇచ్చిందని టీజీవో ఉమ్మడి జిల్లా సమన్వయకర్త జగన్మోహన్‌రావు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా టీఎస్‌సీపీఎస్‌ఈయూ కన్వీనర్ ఏఈ దొడ్డపాటి హరికుమార్ ఆధ్వర్యంలో టీజీవోలో మిళతం చేసే కార్యక్రమం శనివారం జరిగింది. హనుమకొండ కలెక్టరేట్ ప్రాంగణంలోని టీజీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథిగా హాజరైన జగన్మోహన్‌రావు మాట్లాడారు. జీడబ్ల్యూఎంసీ ఏఈలు టీజీవో చేరడం అభినందనీయమన్నారు. ఇంజనీరింగ్ అధికారుల సమస్యల పరిష్కారానికి పోరాడుతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బల్దియా ఇంజనీరింగ్ అధికారులు కార్తీక్‌రెడ్డి, ప్రవళి, మిజముల్, సౌజన్య, రాగి శ్రీకాంత్, మేనక, అజ్మీరా శ్రీకాంత్, విజయలక్ష్మి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏఆర్ కిష్టయ్య సస్పెన్షన్

వీసీ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ సస్పెండ్ ఉత్తర్వులు జారీ



కేయూ క్యాంపస్, జనవరి 6: కాకతీయ యూనివర్సిటీ ఆడిట్ విభాగం అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.కిష్టయ్యను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ శనివారం రాత్రి కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 5న శుక్రవారం కేయూ ఆడిట్ కార్యాలయంలోని ఏఆర్ కిష్టయ్య తన చాంబర్‌లో వర్సిటీ హస్టల్స్‌కు పాలు, పెరుగు సరఫరా చేసే కాంట్రాక్టర్ పి.రాజేందర్ నుంచి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు చిక్కాడు, ఈ నేపథ్యంలో శనివారం కిష్టయ్యను ఏబీసీ కోర్టుకు సంబందిత పోలీసులు అధికారులు హాజరుపరిచారు. హైదరాబాద్‌లోని ఏసీబీ మేజిస్ట్రేట్ కిష్టయ్యను 14 రోజుల రిమాండ్‌కు ఆదేశించగా చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఏసీబీ పోలీసుల అరెస్ట్, రిమాండ్, ఏసీబీ డీఎస్పీ సమాచారం ఆధారంగా కిష్టయ్యను శాఖపరమైన చర్యల్లో భాగంగా ఉద్యోగం నుంచి సస్పెండ్ చేస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే తదుపరి చర్యలు కోర్టు ఉత్తర్వుల మేరకు ఉంటాయని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు స్పష్టంచేశారు.

కేయూ ఏఆర్ కిష్టయ్య ఇంట్లో ఏసీబీ సోదాలు

కేయూలో శుక్రవారం మధ్యాహ్నం ఆడిట్ కార్యాలయంలో లంచం తీసుకుంటూ పట్టుబడిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య ఇంట్లో శనివారం ఏసీబీ డీఎస్పీ సాంబయ్య నేతృత్వంలో సోదాలు నిర్వహించారు. వర్సిటీలో కిష్టయ్య ఆఫీస్‌లోనూ పనిచేస్తున్న తోటి ఉద్యోగుల వివరాలు, ఫోన్‌నెంబర్లను సేకరించారు. కిష్టయ్య ఇంట్లో పెద్ద ఎత్తున బంగారంతో పాటు నగదు, దస్తావేజులు, ఇతర వివరాలను ఏసీబీ పోలీసులు సేకరించారు. కిష్టయ్య అక్రమ ఆస్తులను గుర్తించినట్లు తెలుస్తోంది. కాగా, కిష్టయ్యను హైదరాబాద్‌లోని ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బావిలో దూకి యువతి ఆత్మహత్య

మరిపెడ రూరల్ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 6 : అనుమానాస్పదంగా బానోతు చామంతి (18) అనే యువతి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మూలమర్రి తండాలో చోటు చేసుకుంది. మృతురాలు తండ్రి శ్రీను, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం. మూలమర్రి తండాకు చెందిన బానోతు శ్రీను-చిలకమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్దకూతురుకి వివాహమైంది. అనారోగ్యంతో మూడేళ్ల క్రితం చిలకమ్మ మృతి చెందింది. రెండో కుమార్తె చామంతి వాల్యాతండాకు చెందిన వాసు అనే యువకుడితో ప్రేమలో పడింది. గత 20 నెలల క్రితం చామంతి, వాసుకు వాగ్వావాదం జరిగింది. దీంతో ఆమె పురుగుల మందు సేవించింది. ఖమ్మంలోనే ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందింది. చామంతి చికిత్సకు సుమారు రూ.3లక్షల ఖర్చు అయింది. ఆ తర్వాత పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి, వాసుకు రూ.4 లక్షలు జరిమానా విధించారు. అయితే ఈమధ్య కాలంలోనే వాసు, చామంతి ఇద్దరూ కలవడం జరిగింది. ఈ నేపథ్యంలో చామంతి, వాసును పెళ్లి చేసుకోమని అంటే వాసు తాను ఇచ్చిన రూ.4 లక్షలు ఇస్తేనే పెళ్లి చేసుకుంటాను అని అంటున్నాడని వారు తెలిపారు. చామంతి తండ్రి శ్రీనుకు కేవలం 15 గుంటల వ్యవసాయ భూమి మాత్రమే ఉంది. ఈ క్రమంలో ఈనెల 2న మండల కేంద్రంలోని ఓ థియేటర్‌లో సినిమా చూసి, తానంచర్లకు వెళ్లి వాసుకు ఫోన్‌చేసి తాను ఆత్మహత్య చేసుకుంటాను అని చెప్పి, మూలమర్రి తండా శివారు రైతు వేదిక వద్ద వ్యవసాయ బావిలో దూకి చామంతి ఆత్మహత్య చేసుకుంది. కాగా, వ్యవసాయ పొలంలో ఉన్న గిరిజనులు శనివారం బావి వద్దకు వెళ్లగా మృతదేహం తేలియాడుతూ కన్పించింది. వెంటనే వారు పోలీసులుకు సమాచారం అందివ్వగా పోలీసులు వెళ్లారు. తండ్రి బానోతు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తహెర్‌బాబా తెలిపారు.



'ట్రాఫిక్'లో వసూళ్ల దందా

తనిఖీల్లో కొందరు అధికారుల చేతివాటం ● డ్రంకెన్ డ్రైవ్ టార్గెట్ పేరుతో అక్రమ సంపాదన ● కొన్ని చోట్ల ప్రయివేటు వ్యక్తులతో దందా

ట్రాఫిక్ విభాగంలో వసూళ్ల పర్వం పెచ్చుమీరిపోతోంది. తనిఖీల పేరుతో వాహనదారుల జేబులు గుల్ల చేస్తున్నారు. కొందరు అధికారులు సంపాదనే ధ్యేయంగా దిగజారుతున్నారు. ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవ్ వారికి కాసుల వర్షం కురిపిస్తోంది. ఎవరైనా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే చాలు.. ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నారు. అలాగే నెలవారీగా ఇసుక వాహనాలు, క్వారీ, రెడ్‌మిక్స్ తదితర వాటి నుంచి వచ్చే మామూళ్లతో లక్షలకు పడగెత్తుతున్నారు. వాహనదారులను పీల్చి పిప్పి చేస్తున్న కొందరు ట్రాఫిక్ పోలీసులపై సీపీ అంబర్‌కిషోర్ ఝా దృష్టిసారించారు. ఈ నేపథ్యంలోనే యువకుల నుంచి డబ్బులు తీసుకున్న ట్రాఫిక్ ఎస్ఐ డేవిడ్‌ను సస్పెండ్ చేశారు. దీంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

హనుమకొండ క్రైం, జనవరి 6: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రాఫిక్ పోలీసు స్టేషన్ల పరిధిలో కొందరు అధికారుల తీరు పోలీసు శాఖకే మచ్చ తీసుకువస్తోంది. తనిఖీల్లో అక్రమ సంపాదనే ధ్యేయంగా అందినకాడికి దండుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తి దొరికితే చాలు.. ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్నారు. సాధారణంగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని ప్రయివేటు పార్కింగ్ సెంటర్లలో ఉంచుతారు. నిజానికైతే అక్కడ రోజుకు రూ.10 చార్జి చేయాలి. కానీ పార్కింగ్ యజమానులు వాహనదారుడి నుంచి రోజుకు రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేసి ట్రాఫిక్ సిబ్బందికి ప్రతీ నెలా మామూళ్ల రూపంలో అప్పగిస్తారనే ప్రచారం ఉంది. ఇక ప్రభుత్వ ఉద్యోగులు పట్టుబడితే రూ.10వేలు ముట్టజెప్పనిదే వదలరు. ఇలా ఇటీవలకాలంలో చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు ట్రాఫిక్ పోలీసులకు తాగి పట్టుబడి డబ్బులు ముట్టజెప్పి మరీ తేలు కుట్టిన దొంగలా కిక్కురుమనకుండా మిన్నకుండిపోయారు.

డ్రంకెన్ డ్రైవ్‌లే ఆదాయంగా..

వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని ఓ పోలీసు పరిధిలో పని చేస్తున్న అధికారికి డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు ఆదాయమార్గంగా ఏర్పడింది. పోలీసు అధికారుల ఆదేశాల మేరకు ప్రతీరోజూ టార్గెట్‌గా చేయాల్సిన డ్రంకెన్‌డ్రైవ్‌ల పేరుతో అందినకాడికి దండుకుంటున్నాడనే విమర్శలు వస్తున్నాయి. తన సర్వీసు ముగింపునకు దగ్గరగా ఉండడంతో ఇదే అదును గా భావించి నాలుగురాళ్లు వెనకేసుకునే పనిలో పడ్డాడు. ఇలా ప్రతీ రోజూ రూ.10వేలకు తక్కువ కాకుండా పలు సెంటర్‌లలో అడ్డాపెట్టి వాహనాల తనిఖీ, డ్రంకెన్‌డ్రైవ్ పేరుతో సంపాదనకు ఎగబడ్డాడు. తన వద్ద ఇద్దరు నమ్మకమైన వ్యక్తులు ఒక ప్రైవేటు డ్రైవర్, ఒక హోంగార్డును వెంటేసుకుని నగర ప్రజలను డబ్బుల కోసం నరకం చూపిస్తున్నాడు.

మందుబాబుల జేబులు గుల్ల

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తులను కోర్టు కానిస్టేబుళ్లతో పాటు సంబంధిత ట్రాఫిక్ పోలీసు అధికారులు అందిన కాడికి దండుకుంటారనే ప్రచారం ఉంది. మందుబాబుల జేబుల ను ఓ కోర్టు కానిస్టేబుల్ గుల్ల చేస్తున్నాడనే విమర్శలున్నా యి. ఇలా లక్షలకు పడగెత్తే కానిస్టేబుల్.. సంబంధిత సీఐ కి నెలకు రూ.1లక్ష లంచం ఇస్తున్నాడంటే ఏమేరకు వసూలు చేస్తున్నారో అర్థమవుతోంది. బాధితులనుంచి రూ.3 వేలకు పైగా వసూలు చేసి సంబంధిత స్టేషన్ అధికారికి పర్సంటేజీ లెక్క ముట్టజెబుతున్నాడు. అయితే పట్టుబడిన వ్యక్తి కోర్టులో చెల్లించాల్సిన డబ్బుల కంటే సదరు కోర్టు కానిస్టేబుల్‌కు చెల్లించే డబ్బే ఎక్కువవుతోందని లబోదిబోమంటున్నారు.

నెలవారి మామూళ్లు


ఇసుక డంపులు, మొరం ట్రాక్టర్లు, ఆటో అడ్డాలు, రెడ్‌మిక్స్ యజమానులనుంచి ఒక్కో ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు రూ.5లక్షల వరకు మామూళ్లు వస్తున్నాయనే ప్రచారం జరుగుతోంది. ఇంత జరుగుతుంటే పోలీసులు ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారో ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా సీపీ సార్.. జర ట్రాఫిక్ అధికారులపై దృష్టి సారించి సామాన్యులను కాపాడాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ప్రయివేటు వ్యక్తుల హవా

వారు పోలీసు కానిస్టేబుళ్లు కాదు.. హోంగార్డులు అసలే కాదు.. కానీ ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారి వెనకాల పరుగెత్తి మరీ పట్టుకుంటారు.. వాహన యజమాని అనుమతి లేకుండానే బైక్ తాళం లాక్కుని అధికారి వద్దకు తీసుకెళతారు. వారు అనుకున్న ప్రకారం డబ్బులు ముట్టజెబితే వదిలేస్తారు.. లేదంటే వారే డ్రంకెన్ డ్రైవ్ తనిఖీ చేసి కోర్టుకు వెళ్లేలా చేస్తారు.. ఇటీవల వరంగల్ పోలీసు కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసు విభాగంలో ప్రయివేటు వ్యక్తుల విచ్చలవిడితనం పెరిగిపోయింది. ఎస్ఐ, ఆర్ఎస్ఐ, సీఐ స్థాయి అధికారుల వద్ద పని చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. అధికారులకంటే వీరే ఎక్కువ ఫోజులు కొడుతూ రోడ్లపై హల్‌చల్ చేస్తున్నారు. ఇలాంటి వ్యక్తులు ట్రాఫిక్ విభాగంలో చేరి విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల కమిషనరేట్ పరిధిలో చాలా చోట్ల ఇలాంటి ఘటనలు వెలుగుచూస్తున్నాయి.

ట్రాఫిక్ ఎస్ఐ డేవిడ్‌పై వేటు

యువకుల నుంచి డబ్బులు వసూలు చేయడంతో సస్పెన్షన్



హనుమకొండ క్రైం, జనవరి 6: వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న సిలివేరు డేవిడ్‌ను సీపీ అంబర్ కిశోర్ ఝా సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొందరు యువకుల నుంచి లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోవడంతో విచారణ చేపట్టిన సీపీ.. ఎస్ఐ డేవిడ్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. వివరాల్లోకి వెళితే..

ఇటీవల హనుమకొండ పెద్దమ్మగడ్డ సమీపంలో ఎస్ఐ డేవిడ్ వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై వస్తుండగా ఆపాడు. వాహన పత్రాలు లేకపోవడంతో విద్యార్థులను ఎస్ఐ డబ్బులు డిమాండ్ చేశారు. దీంతో చేసేదేమీ లేక విద్యార్థులు రూ.500 ఇచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఈ తతంగాన్ని బాధిత యువకుల స్నేహితులు అక్కడే ఉన్న భవనంపై నుంచి సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఆపై ఎస్ఐ డేవిడ్ డబ్బులు తీసుకుంటున్న వీడియోను కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మరి కొందరు ఎస్ఐ నిర్వాకాన్ని సీపీ అంబర్ కిశోర్ ఝాకు పంపించారు. దీంతో సీపీ నిఘా వర్గాల ద్వారా విచారణ చేయించారు. నిజమని తేలడంతో శనివారం విధుల నుంచి తొలగించారు.

వివాదాస్పదుడు

ఎస్ఐ డేవిడ్‌కు ఆది నుంచి వివాదాస్పదుడిగా పేరుంది. కానిస్టేబుల్‌గా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించి ఎస్ఐ ర్యాంకర్‌గా పదోన్నతి పొందిన డేవిడ్.. గతంలో వరంగల్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో రెండేళ్లు పనిచేశారు. అక్కడి ప్రజలను, సిబ్బందిని డబ్బుల కోసం ఇబ్బంది పెట్టడంతో అప్పటి సీపీ రంగనాథ్ డేవిడ్‌ను కొడకండ్ల పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. అక్కడ సిబ్బందితో గొడవ పడడంతో హనుమకొండ ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. ఇక్కడ మూడు మాసాల్లో వాహనదారులను డబ్బుల కోసం ఇబ్బంది పెట్టినట్టు తెలిసింది. దీంతో కొందరు ఎస్ఐ అక్రమాలకు చెక్ పెట్టేందుకు డబ్బులు తీసుకుంటున్న వీడియోను సీపీకి పంపించడంతో విధుల నుంచి తొలగించారు.

టెక్స్‌టైల్ పార్క్ సమస్యలు పరిష్కరించాలి

మడికొండ, జనవరి 6: మడికొండ శివారు టెక్స్‌టైల్ పార్కులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక టెక్స్‌టైల్ వ్యాపారులు శనివారం రాష్ట్ర టెక్స్‌టైల్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హైదారాబాద్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కొవిడ్ మహమ్మారి టెక్స్‌టైల్ మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేయడంతో బ్యాంక్ చార్జీలు, వడ్డీలు కూడా చెల్లించలేనేని పరిస్థితి నెలకొందన్నారు. బ్యాంక్ వడ్డీలు, చెల్లించడానికి చేతిలో చిల్లి గవ్వకూడా లేదని తెలిపారు ప్రభుత్వం సహకరించి ఫ్యాక్టరీలు సక్రమంగా నడిచి తమ జీవితాల్లో వెలుగులు నింపే విధంగా చర్యలు తీసుకోవాలని ఈ మేరకు వినతి పత్రంలో పేర్కొని మంత్రిని కోరినట్లు మడికొండ టెక్స్‌టైల్ మానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కూరపాటి విజ్‌కుమార్, దగ్గు రవిందర్‌రావు, మామిడి రాజు, మచ్చ వీరన్న, డాక్టర్ వెంకట్‌రాములు, రంగస్వామి, తిరుపతి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న లారీ


ప్రైవేటు టీచర్ మృతి



హనుమకొండ టౌన్, జనవరి 6: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతల్ భీమారం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయురాలు సునయన(25) మృతి చెందారు. భీమారం సమీపంలోని స్కిల్ స్ట్రోక్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేస్తున్న సునయన తోటి ఉపాధ్యాయుడు విశ్వచటర్జీతో కలిసి శనివారం ఉదయం ద్విచక్ర వాహనంపై పాఠశాలకు వెళుతోంది. ఈ క్రమంలో భీమారం పెట్రోల్ బంక్ ముందు హనుమకొండ నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ద్విచక్రవాహనం వెనుక కూర్చున్న సునయన లారీ వెనుక చక్రాల కింద పడిపోగా నడుపుతున్న విశ్వచటర్జీ పక్కకు పడిపోయాడు. లారీ చక్రాల కింద పడిపోయిన సునయన నుదుము నుంచి కాళ్ల వరకు నుజ్జునుజ్జు అయ్యాయి. విశ్వ చటర్జీకి స్వల్ప గాయాలయ్యాయి. లారీ డ్రైవర్ పరారయ్యాడు.

సమాచారం అందుకున్న కేయూ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పాఠశాల యాజమాన్యానికి సమాచారం అందించారు. తీవ్రగాయాలైన సునయనను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా మెరుగైన వైద్యం అందించేందుకు హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సునయన మృతి చెందింది. ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు. కాగా ముంబయికి చెందిన సునయన రెండేళ్లుగా ప్రైవేటు ఉపాధ్యాయురాలిగా చేస్తూ భీమారం సమీపంలోని బ్యాంక్ కాలనీలో అద్దెకు ఉంటోంది. సునయన మృతి పట్ల పాఠశాల చైర్మన్ తిరుమల్‌రావు, డైరెక్టర్ అనూప్ సంతాపం తెలిపారు.


లారీ చక్రాల కింద సునయన



ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ పర్మార్ పింకేశ్ కుమార్ ● చిలుపూర్‌లో ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ పరిశీలన ● పలు సూచనలు, సలహాలు అందజేత

చిలుపూర్, జనవరి 6 : ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పర్మార్ పింకేశ్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం (మండల విద్యా వనరుల కేంద్రం)లో శనివారం జరుగుతున్న అభయహస్తం ఆరు గ్యారెంటీలకు సంబంధించి ఇటీవల స్వీకరించిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజల నుంచి స్వీకరించిన ప్రతీ దరఖాస్తును ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన పోర్టల్‌లో భద్రపరచాలని సూచించారు. ప్రతీ ఆపరేటర్ విధిగా రోజూ 100 దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేలా చూడాలని ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, మండల అదనపు ప్రత్యేక అధికారి రమేష్, ఎంపీడీవో పులుగు వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీవో శ్రీపాద మధుసూధన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దూలమ్మ, పంచాయతీ కార్యదర్శులు ఎమ్డీ అజీజ్ పాషా, షైమ, శషిధర్, శ్రీకాంత్, టీఏ చేరాలు, రాజు పాల్గొన్నారు.

● లింగాలఘణపురం : ఈ నెల 28న ప్రారంభమైన ప్రజాపాలన దరఖాస్తులను లింగాలఘణపురం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం, సెర్ప్ కార్యాలయంలో ఆన్‌లైన్ క్రోడీకరణ చేస్తుండగా శనివారం జిల్లా అడిషనల్ కలెక్టర్ పర్మర్ పింకేష్‌కుమార్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. దరఖాస్తులను వేగవంతంగా ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. అయితే సాంకేతిక సమస్యల కారణంగా సర్వర్ డౌన్ ఉండటం వల్ల క్రోడీకరణలో కాస్త జాప్యం జరుగుతుందని అధికారులు అడిషనల్ కలెక్టర్‌కు సూచించారు. ఆన్‌లైన్ విషయంలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఏసీ తెలిపారు. కార్యక్రమంలో తహసీర్ వినయలత, ఎంపీడీవో సురేందర్ నాయక్, ఎంపీవో మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.



లింగాలఘణపురంలో ఆన్‌లైన్ క్రోడీకరణను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ పర్మర్ పింకేష్‌కుమార్

రేపు జనగామలో జాబ్‌మేళా

జనగామ టౌన్, జనవరి 6: ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాల భర్తీకి సోమవారం జనగామలోని ఏకశిల ఐటీఐలో కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి ప్రకటించారు. వెల్‌స్పన్ కంపెనీలో సిస్టమ్ ఆపరేటర్, మెషీన్ ఆపరేటర్ ఉద్యోగాలున్నాయని, ఇంటర్, ఒకేషనల్, ఐటీఐ, డిగ్రీ అర్హత కలిగిన వారు తమ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డుతో ఉదయం 10:30 గంటలకల్లా ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు 79954 30401 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

గుండెపోటుతో రేషన్‌డీలర్ మృతి

లింగాలఘణపురం, జనవరి6: లింగాలఘణపురం మండలం బండ్లగూడెం గ్రామానికి చెందిన రేషన్ డీలర్ మద్దెల అంజయ్య(67) శనివారం గుండెపోటుతో మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడెంలో ప్రజాపాలన కార్యక్రమానికి హాజరై తిరిగి ఇంటికి వెళ్లిన కొద్దిసేపట్లోనే గుండె నొప్పి రావడంతో ఇంట్లో కుప్పకూలిపోయాడు. వెంటనే గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించే లోపే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య అండాలు, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు బంజర పంచాయతీ కార్యదర్శి క్రాంతి ఉన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా అధ్యక్షురాలిగా సుమతి

జనగామ టౌన్, నవంబరు 6: జాతీయ మానవ హక్కుల కమిటీ(ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జనగామ జిల్లా అధ్యక్షురాలిగా బొట్ల సుమతి ఎన్నికయ్యారు. శనివారం జిల్లా కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ప్రకటించారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా చిలువేరు అభిషేక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మనోహర్, సంయుక్త కార్యదర్శులుగా మైలారపు ఆంజనేయులు, మేకల సమ్మయ్య, ప్రచార కార్యదర్శిగా కాటం లక్ష్మి, అధికార ప్రతినిధిగా తిప్పారపు రవి, సోషల్ మీడియా కన్వీనర్‌గా చింత నరేశ్ ఎన్నికయ్యారు.

పిల్లలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలి

జనగామ టౌన్, జనవరి 6: తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించి ఉన్నత స్థాయికి వెళ్లేలా తీర్చిదిద్దాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ సూచించారు. శనివారం జనగామలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, వసతులను తప్పకుండా వినియోగించుకోవాలన్నారు. విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమన్నారు. అనంతరం మహిళలు, పురుషులతో బాల్య వివాహాలు చేయబోమంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం చీఫ్ రవీంద్ర, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ జ్యోష్న, శ్రీహరి, మార్కస్ హోప్ సంస్థ ఎన్‌జీవో దీప్తి రమేశ్, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి విక్రమ్

అమ్మి'తేనే'.. ఆకలి తీరేది

(5వ పేజీ తరువాయి)

ఎంపిక చేసుకుని జీవనం గడుపుతుంటారు. అయితే వీరు చెట్లు, చేమలు, రహదారుల వెంట ఉంటే బస్టాండ్లను ఆవాసాలుగా మలుచుకుని రోజులను గడుపుతుంటారు. అక్కడే రోడ్ల వెంట వంటలు చేసుకుని భోజనం చేస్తారు. ఎంచుకున్న ఏదేని ప్రాంతంలో గరిష్ఠంగా 20 రోజులు గడిచిందంటే చాలు అక్కడి నుంచి మరో పట్టణానికి చేరుకుని అక్కడి ప్రాంతాల్లో తేనె సేకరించే పనిలో మునిగి తేలుతారు.

- కిలో తేనెకు రూ. 350 నుంచి..

తేనె పట్టేవాళ్లు ప్రతీ రోజు ఇద్దరు ముగ్గురు జట్టుగా బయలుదేరి చెట్ల వెంబడి తేనెను సేకరించి బాటిళ్లలో నింపుకుంటారు. తేనె పట్టించేందుకు చెట్ల యజమానులు డబ్బులు చెల్లిస్తే పట్టిన తేనెను వాళ్లకే ఇచ్చివస్తారు. ఒకవేళ చెట్లు, టవర్, బిల్డింగ్ నిర్వాహకులు తేనెను తొలగించేందుకు నామమాత్రంగా డబ్బులు చెల్లిస్తే వచ్చిన తేనెను కిలోకు రూ. 350 నుంచి రూ. 500 దాకా డిమాండ్‌ను బట్టి విక్రయిస్తారు.

- విద్యకు దూరంగా సంతానం..

తేనె పట్టేవాళ్లు ప్రధానంగా నిర్ధిష్టమైన చోట స్థిర నివాసం లేకపోవడం చేత సీజన్‌ను బట్టి సంచారం చేస్తూ ఒక్కో మాసం ఒక్కో చోట తిరుగుతుంటారు. ఈ క్రమంలో తమ సంతానంలో ఎక్కువ శాతం పిల్లలు విద్యకు దూరంగా ఉండాల్సి వస్తుందంటున్నారు తేనె పట్టేవాళ్లు. అయితే వీళ్లకు ఎక్కడ కూడా సరైన ఆధారం లేకపోవడంతో పిల్లలను హాస్టల్‌లో వేయకుండా తమ వెంటనే తిప్పుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- తరతరాలుగా ఇదే పని.. కొమ్మ హనుమంతు. ప్రకాశం జిల్లా



మాది ఆంధ్రాలోని ప్రకాశం జిల్లా పరుసూరు ప్రాంతం. మా తాతముత్తాతల నుంచి తేనె పట్టే వృత్తిని కొనసాగిస్తున్నారు. మేము కూడా అదేబాటలో పనిచేస్తున్నాం. చాలా సార్లు తేనెతుట్టెలను జోపుతండగా ఈగలు వెంబడించి దాడి చేస్తాయి. తేనె పట్టి అమ్ముతున్న క్రమంలో వచ్చిన డబ్బులతో జీవనం వెళ్లదీసున్నాం మాకు ఇన్నేళ్లుగా ఇల్లు గానీ, జాగ గానీ లేదు. మేము బతకడం మా పిల్లలను సాదుకోవడమే మాకు జీవితమంతా సరిపోతుంది.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి

● స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు ● ఎల్ అండ్ టీ సిబ్బందితో కలిసి యూ టర్న్‌ల పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 6: జాతీయ రహదారి పై నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి నిండు ప్రాణాలు పోతున్నాయని సంబంధిత అధికారులు వెంటనే ప్రమాధ నివారణ చర్యలు చేబట్టాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం డివిజన్ కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో ఎన్‌హెచ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. రహదారి పై ప్రమాదలు జరుగకుండా రహదారి వెంట సూచికల బోర్డులను ఏర్పాటు చేయలన్నారు. యూటర్న్‌ల వద్ద వాహనాల వేగనియంత్రణ బోర్డులను ఏర్పాటు చేయాలని. రహదారి పై వాహనాల స్పీడును తెలియపరిచేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. మరి కొద్ది రోజుల్లో మేడారం జాతర వస్తున్నందున ఎక్కడా పెండిగ్ పనులు లేకుండా చూడాలని అదేశించారు. కార్యక్రమంలో సీఐలు ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, సట్ల రాజు, ఎస్సైలు ప్రవీణ్, రఘుపతి, నాగరాజు, ఎన్‌హెచ్ మేనేజర్ నవనీత్, డీఈ కృష్ణారెడ్డి, గోవిందకుమార్, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

● చిలుపూర్ : వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ సుందరగిరి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండలంలోని చిన్నపెండ్యాలలో హనుమకొండ - హైదరాబాద్ 163వ జాతీయ రహదారిని ఎన్‌హెచ్, ఎల్‌అండ్‌టీ సీనియర్ కన్‌స్ట్రక్షన్ మేనేజర్ గోవిందకుమార్, ఇతర సిబ్బందితో కలిసి సందర్శించారు. వరుస ప్రమాదాలు జరుగుతున్న గేమ్యాతండా క్రాస్‌రోడ్‌తో పాటు, స్థానిక గ్రానైట్ కంపెనీ ఎదుట యూటర్న్, వంగాలపల్లి - కరుణాపురం చౌరస్తా, నష్కల్ క్రాస్‌రోడ్ తదితర స్థలాలను గుర్తించారు. కార్యక్రమంలో జనగామ రూరల్, స్టేషన్‌ఘన్‌పూర్ సీఐలు ఎడవల్లి శ్రీనివాసరెడ్డి, సట్ల రాజు, ఎస్సైలు బొల్లం వినయ్‌కుమార్, రఘుపతి, ప్రవీన్‌తో పాటు, ఎల్‌అండ్‌టీ సిబ్బంది గోవిందు, ఆర్. రాజశేఖర్ రెడ్డి, ఎం. శ్రీనివాస్, జి. వెంకటేశ్, అక్బర్ భగ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



హనుమకొండ - హైదరాబాద్ జాతీయ రహదారిపై యూటర్న్‌ను పరిశీలిస్తున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ శ్రీనివాసరావు

జఫర్‌గడ్ మండల సభ వాయిదా

జఫర్‌గడ్, జనవరి 6 : జఫర్‌గడ్ మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఇటీవల గుండెపోటుతో మరణించిన జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డికి సంతాప సూచకంగా సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ రడపాక సుదర్శన్ ప్రకటించారు. శనివారం ఎంపీపీ అధ్యక్షతన మండల సభ ప్రారంభం కాగానే దివంగత జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి చిత్ర పటానికి ఎంపీపీతో పాటు జడ్పీటీసీ బేబీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ కనకయ్య, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, తహసీల్దార్ ఆంజనేయులు, సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, మండల పరిషత్ ఉద్యోగ సిబ్బంది పాల్గొన్నారు.

భూమిలేని మృతుల కుటుంబాలకు చేయూత

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 6: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన వైస్ ఎంపీపీ చల్లా సుధీర్ రెడ్డి గ్రామంలో ఎవరు మృతి చెందినా వారికి గత నాలుగేళ్లుగా రూ 5వేల ఆర్థిక సాయం అందిస్తున్నారు. అందులో భాగంగా వ్యవసాయ భూమిలేని మృతుల కుటుంబాలకు రూ 5వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు 50 కిలోల బియ్యంను అందనంగా అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామానికి చెందిన గుర్రపు రాజమ్మ (54) శుక్రవారం రాత్రి మృతి చెందగా శనివారం సుధీర్‌రెడ్డి మృతురాలి ఇంటిని సందర్శించి మృతదేహం పై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ 5వేల ఆర్థికసాయంతో పాటు 50 కిలోల బియ్యంను అందించారు. ఉప సర్పంచ్ మారపాక రాములు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దేవరుప్పుల, జనవరి 6: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే విధంగా కృషి చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డికి సీఐటీయూ ప్రతినిధులు శనివారం దేవరుప్పుల మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న మాట్లాడుతూ గత ప్రభుత్వం జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించిందని, మల్టీ పర్పస్ విధానం అమలుపర్చి ఉద్యోగులకు గుర్తింపు లేకుండా చేసిందన్నారు. నూతన ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి మాట్లాడుతూ జీపీ కార్మికుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బస్వ రామచంద్రు, ప్రతినిధులు ఎడెల్లి వెంకట్‌రెడ్డి, ఉప్పుల అయిలయ్య, రమేష్, బాబూరావు, గణగాని ఉప్పలయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రాముడి అక్షింతల వితరణ

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 6: అయోధ్యరాముడి అక్షింతల వితరణ కార్యక్రమాన్ని శనివారం భక్తజనసందోహంతో శోభాయమానంగా నిర్వహించారు. రామ భక్తులు, భజరంగ్‌దళ్, వీహెచ్‌పీఎస్ నాయకులు, మహిళలు అక్షింతలను పాత్రను తలపైన ఎత్తుకొని డివిజన్ కేంద్రంలో ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేశారు. నాయకులు గట్టు శ్రీనివాస్, గోనెల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

● దేవరుప్పుల : శ్రీరామజన్మభూమి అయిన అయోధ్యలోని తీర్థక్షేత్ర ట్రస్ట్ ద్వారావచ్చిన పూజిత అక్షింతలను శనివారం మండలకేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతీ హిందువు ఇంటికి అందజేశారు. ఈ సందర్భంగా సీతారాంపురంలో జరిగిన కార్యక్రమంలో దేవరుప్పుల ఎంపీపీ బస్వ సావిత్రి ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అదే విధంగా పెద్దమడూరులో జరిగిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్ పాల్గొని అందజేశారు. ఆయా గ్రామాల్లో జరిగిన అక్షతల కార్యక్రమంలో బస్వ మల్లేశం, రెడ్డిరాజుల రమేష్, గుంటి అజయ్, పానుగంటి రామలింగం, వంగ పద్మ, వంగ వెంకటేశ్వర్లు, ఆకవరం జనార్దన్‌రెడ్డి, పెదగోని రాజు, శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలి

చిలుపూర్, జనవరి 6 : ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు కొల్లం మహిపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక హెచ్‌ఎం వెలుదండి లీల స్వచ్ఛంద ఉద్యోగ విరమణ కార్యక్రమంలో శనివారం చిలుపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఆట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహిపాల్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులకు విరమణ తప్పనిసరి అని, విధి నిర్వహణలో అంకితభావంతో పని చేసినప్పుడే ప్రత్యేక గుర్తింపు లభిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 200ల యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ప్రభుత్వ పాఠశాలలకు వర్తింప జేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం హెచ్‌ఎం లీలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం దాసి శ్రవన్‌కుమార్, పాఠశాల శాశ్వత దాత పెద్ది వెంకట నారాయణ, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా నాయకుడు ఏడవెల్లి మాధవరెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం కాయితాపురం రాంచంద్రారెడ్డి, బండి రవీందర్, మండల సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, సుధ, అరుణ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 6: మండలంలోని తాటికొండ గ్రామానికి చెందిన కడియం యువసేనా సోషల్ మీడియా ఇన్‌చార్జి మేకల శ్రీకాంత్ తండ్రి మేకల కొమురయ్య (50) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కడియం ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ కడియం కావ్య మృతుడి ఇంటిని శనివారం సందర్శించి మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీకాంత్‌ను ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదేవిధంగా గ్రామానికి చెందిన గుర్రపు రాజమ్మ మృతి చెందగా మృతురాలి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె వెంట నాయకులు రాపోలు మధుసూదన్ రెడ్డి, బానోతు రాజేష్‌నాయక్, చాడ రాజ్‌కుమార్, ఐలోని సుధాకర్‌గౌడ్, పొన్న శ్రీనివాస్‌గౌడ్, పోకల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల ప్రవేశ పరీక్ష కర పత్రం ఆవిష్కరణ

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జనవరి 6: డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్ జీపీ వద్ద తెలంగాణ గురుకులాల ప్రవేశ పరీక్ష కర పత్రాన్ని సంక్షేమ గురుకులం ప్రిన్సిపాల్ కాళహస్తి, సర్పంచ్ టి.సురేష్ శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. ప్రస్తుత ఏడాది నాలుగవ తరగతి చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ విద్యార్థులు గురుకులాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్షకు విద్యార్థులు టీజీసెట్.సీజీజీ.గౌట్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈ నెల 6 నుంచి 20 వరకు పొడిగించిందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలి

దేవరుప్పుల, జనవరి 6: ఫిబ్రవరి 15 సేవాలాల్ జయంతి రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని సేవాలాల్ విద్యార్థి సేన జిల్లా కార్యదర్శి లావుడియా అనిల్ చౌహాన్ కోరారు. దేవరుప్పుల మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఆరాధ్య దైవంగా భావించే శ్రీశ్రీశ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిసున్నది కానీ అదే రోజును సెలవు దినంగా ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీనివాస్, గణేష్, అభి, సంధ్య పాల్గొన్నారు.

రైతులకు చిరు ధాన్యాల పంపిణీ

తరిగొప్పుల, జనవరి 6: లోడి సాంఘీక సంక్షేమ సంస్థ ఆధ్వరంలో లోడి డైరెక్టర్ ఇన్నారెడ్డి ఆదేశానుసారం శనివారం మండలంలోని పలు గిరిజన తండాల్లో రైతులకు గడ్డి విత్తనాలను పంపిణీ చేశారు. మండలాన్ని నాలుగు క్లస్టర్లుగా విభజించి క్లస్టర్లలో రైతులకు సంస్థ సభ్యులు ఈ విత్తనాలు అందజేశారు. ఆ సంస్థ ఫీల్డ్ కోఆర్డినేటర్ కోడం సత్యనారాయణ మండలంలోని బొంతగట్టునాగారం క్లస్టర్ పరిధిలోని గుడిబండతండాలో రైతులకు గడ్డి విత్తనాలను ఉచితంగా పంపిణీ చేసి వారిని ఉద్దేశిస్తూ మాట్లాడారు. లోడి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఎడ్లను తప్పించబోయి.. చెట్టును ఢీకొన్న ద్విచక్రవాహనం

- భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు

చిలుపూర్, జనవరి 6 : ఎదురుగా వస్తున్న ఎడ్లను తప్పించబోయి ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొన్న మోటార్‌సైకిల్ ప్రమాదంలో భర్త మృతిచెందడంతో పాటు, భార్యకు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని లింగంపల్లిలో జరిగింది. శనివారం స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నష్కల్ గ్రామానికి చెందిన వడ్లకొండ లక్ష్మీనారాయణ (52)కు లింగంపల్లి పంచాంగాల తండా సమీపంలో పౌల్ట్రీ ఫాం ఉంది. తన భార్య రమతో కలిసి ద్విచక్రవాహనంపై ఉదయం ఫాంకు వచ్చిన లక్ష్మీనారాయణ పనులు ముగించుకున్న అనంతరం తిరిగి మోటార్ సైకిల్‌పై ఇంటికి బయలుదేరారు. లింగంపల్లికి వెళ్తుండగా రోడ్డుపై ఒక్కసారిగా ఎడ్లు అడ్డుగా రావడంతో వాటిని తప్పించబోయి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో లక్ష్మీనారాయణ ఛాతికి బలమైన గాయాలు కాగా, అతడి భార్య రమకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులకు సమాచారమందించిన స్థానికులు 108 సాయంతో వీరిద్దరినీ హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అప్పటికే లక్ష్మీనారాయణ మృతిచెందాడు. మృతుడి భార్య రమ పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు లక్ష్మీనారాయణకు ఒక కుమారుడు, కుమార్తె ఉంది. చిలుపూర్ ఎస్సై బొల్లం వినయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగల అస్తిత్వాన్ని చాటాలి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 6: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగల అస్థిత్వాన్ని చాటే విధంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారిని గెలిపించుకొని సత్తా చాటాలని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పిడమర్తి రవి తెలిపారు. శనివారం హనుమకొండలోని జడ్పీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి ఇంటిని పిడమర్తి రవి సందర్శించారు. పిడమర్తికి మారపాక రవి ఘనస్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మా దిగ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు ఎంపీ టికెట్‌లను కేటాయించాలనే అంశం పై చర్చించినట్లు తెలిపారు. రాష్ట్రంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లే ఎక్కువ ఉన్నందున మాదిగలకు ఎంపీ టికెట్‌లను కేటాయించాలనే విషయమై త్వరలోనే భారీఎత్తున మాదిగలు తరలివెళ్లి సీఎం రేవంత్ రెడ్డిని కలిసి అభ్యర్థించేందుకు గాను ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుర్రం యాదగిరి, నాయకులు తీగల మహేందర్, కమలేష్ పాల్గొన్నారు.



పిడమర్తి రవిని సన్మానిస్తున్న మారపాక రవి తదితరులు